క్లుప్తంగా

నేడు మహేశ్వరంలో మంత్రి పర్యటన

మహేశ్వరం: మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు బుధవారం మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి హాజరుకానున్నారని బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో రూ.35.70 లక్షలతో అభివృద్ధి పనులు, అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం రూ.25 లక్షలతో శంకుస్థాపన, రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను వారు ప్రారంభిస్తారన్నారు. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు మందకృష్ణ రాక

మహేశ్వరం: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ రంగారెడ్డి జిల్లా సన్మాహక సదస్సు మండల కేంద్రంలోని పోతర్ల బాబయ్య ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహిస్తున్నామని జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి రావుగళ్ల బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సామూహిక శ్రీ సత్యానారాయణ వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలకమండలి సభ్యులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

వీహెచ్‌కు సన్మానం



వీహెచ్‌ను సన్మానిస్తున్న దేప, నాయకులు

పహాడీషరీఫ్: మల్లాపూర్‌లోని వైఎఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా బీసీ ఐక్యవేదిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావును మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తదితరులు ఉన్నారు.


మహేశ్వరం డిపోలో ఆర్టీసీ కార్మికుల సంబురాలు



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

మహేశ్వరం: ఆర్టీసీని ప్రభుత్వ శాఖలో విలీనం చేస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మహేశ్వరం ఆర్టీసీ కార్మికులు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డిపో ముందు బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి, సీఐ అంజమ్మ, ఎంఎఫ్ ప్రకాష్, ఎస్టీఐ సుశీల, ఆర్టీసీ కార్మికులు శంకర్‌నాయక్, అక్తర్‌పాషా, జితేందర్, లింగం, కిషోర్, ప్రమీల, రమేష్, దేవేందర్, శ్రీశైలం పాల్గొన్నారు.

మురుగు పరుగును ఆపండి



సూరజ్‌నగర్ రోడ్డుపై మురుగు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో పలుచోట్ల డ్రైనేజీ పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాగన్నగూడలోని సూరజ్‌నగర్ కాలనీలో రోడ్డుపైనే డ్రైనేజీ పొంగి ప్రవహిస్తుండటంతో అటునుంచే వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ నేతలకే సభ్యత్వాలా?

- సహకార సంఘం సభ్యత్వంపై బీజేపీ నేతల విమర్శలు
- సబ్సిడీ ఎరువులు, యంత్రాలు ఏమయ్యాయని నిలదీత
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన రైతులకే సభ్యత్వాలు ఇస్తూ ఇతర పార్టీలకు చెందిన రైతులకు సభ్యత్వాలు ఇవ్వడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో బీజేపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. మంగళవారం మహేశ్వరం ఎంపీడీఓ సమావేశం హాలులో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో వ్యవసాయ శాఖ అంశం ప్రారంభం కాగానే మాణిక్యమ్మగూడ, డబిల్‌గూడ, నాగిరెడ్డిపల్లి, చిన్నతూప్ర గ్రామాల సర్పంచ్‌లు చంద్రయ్యగౌడ్, శంకర్, మనోహర్, రఘుపతి గౌడ్ మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన రైతులకు తప్ప బీజేపీకి చెందిన రైతులకు సభ్యత్వం ఇవ్వరా అని ప్రశ్నించారు. సంఘంలో సభ్యత్వ నమోదుకు చిన్నతూప్ర గ్రామం నుంచి 20 మంది వెళ్లగా సంఘంలో రుణాలు తీసుకోవాలి లేదంటే కొన్నిరోజులు ఆగాలని రైతులకు వెనక్కి పంపిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్ సంఘంలో సభ్యత్వం ఉండాలంటే ముందుగా రుణాలు తీసుకోవాలని తెలపడంతో రుణాలు ఉన్నవారే సభ్యులుగా ఉన్నారా? అంటూ బీజేపీ సర్పంచ్‌లు మండిపడ్డారు. ఉద్యానవన శాఖ అధికారుల పనితీరు బాగాలేదని సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీలు ఇవ్వడం లేదని నాగిరెడ్డిపల్లి సర్పంచ్ మనోహర్ సభ దృష్టికి తీసుకొచ్చారు.

పల్లె సమస్యలు పట్టవా..?

మండలంలో ఆర్టీసీ డిపో ఉన్న గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు ఎక్కడా నడవటం లేదని డబిల్‌గూడ సర్పంచ్ బుగ్గని శంకర్ ప్రశ్నించగా డిపో మేనేజర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణాల్లో కానీ విద్యార్థులకు మినహా డబ్బులు రానిది ఏ ఒక్క బస్సు కూడా నడపొద్దని మాకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయని సమాధానం ఇచ్చారు. ఇండ్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూమ్స్, దళితబంధు పథకం ప్రచారానికే పరిమితమైంది తప్పా ఆచరణలో అమలు కావడం లేదని పలువురు సర్పంచ్‌లు ప్రశ్నించారు. రైతులకు రైతుబంధు తప్పా మిగతా సబ్సిడీ పథకాలు ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. గతంలో రైతులకు సబ్సిడీపైన విత్తనాలు, ఎరువులు, యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, స్ప్రేయర్లు ఇచ్చేవారని బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఏమి ఇవ్వడం లేదని మాణిక్యమ్మగూడ సర్పంచ్ చంద్రయ్యగౌడ్ సభలో లేవనెత్తారు. గ్రామ పంచాయతీల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తుంటే బిల్లులు సకాలంలో రావడం లేదని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు పోవడం లేదని అధికారులు ప్రచారం చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారని సర్పంచ్‌లు చంద్రయ్య, శంకర్ సభ దృష్టికి తీసుకొచ్చారు.

మట్టి మాఫియాను అరికట్టాలి

మండలంలో మట్టి మాఫియా యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు, పోలీసులు వారికి మద్దతు పలుకుతున్నారని తుమ్మలూరు ఎంపీటీసీ మద్ది రామిరెడ్డి ఆరోపించారు. మట్టి తవ్వకాలను నియంత్రించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ రఘుమారెడ్డి మాట్లాడుతూ... మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. మండలంలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీతా అంధ్యా నాయక్, ఎంపీడీఓ నర్సింహ, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంఈఓ కృష్ణ, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకలు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- తడి, పొడి చెత్త వేరుగా ఇవ్వాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



తుక్కుగూడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. రోజుల తరబడి గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రజల ఆరోగ్యంతో పాటు, పారిశుద్ధ్య నిర్వహణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ మీ కోసం..

ప్రశ్న: తుక్కుగూడ మున్సిపాలిటీలో ఎన్ని వార్డులు ఉన్నాయి, ఎంత జనాభా ఉంది ?

జవాబు: 2011 జనాభా లెక్కల ప్రకారం మున్సిపాలిటీలో 19,182 మంది జనాభా ఉన్నారు. మొత్తం 15 వార్డులు.

ప్రశ్న: మున్సిపాలిటీ వ్యాప్తంగా ఎంతమంది శానిటేషన్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు ?

జవాబు: 15 వార్డుల్లో మొత్తం 128 మంది శానిటేషన్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ప్రశ్న: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రతీ సంవత్సరం ఎన్ని నిధులు ఖర్చు చేస్తున్నారు ?

జవాబు: సుమారుగా రూ.20లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నిధులు ఖర్చు చేస్తున్నాం.

ప్రశ్న: చెత్త సేకరణకు ఎన్ని వాహనాలు వినియోగిస్తున్నారు ?

జవాబు: పట్టణంలోని ఇళ్లు, వ్యాపార సముదాయాలు, హోటళ్ల నుంచి సేకరించిన చెత్తను, వ్యర్థాలను తరలించడానికి 2 ట్రాక్టర్లు, 13 ఆటోలను ఉన్నాయి.

ప్రశ్న: సేకరించిన చెత్తను ఎక్కడ వేస్తున్నారు?

జవాబు: మున్సిపాలిటీ వ్యాప్తంగా సేకరించిన చెత్తను రావిర్యాలలో ఉన్న డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నాము.

ప్రశ్న: ఫాగింగ్ చేస్తున్నారా, బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారా ?

జవాబు: దోమల నివారణ కోసం ఆయా కాలనీల్లో ఫాగింగ్ చేయిస్తున్నాము. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు.

ప్రశ్న: ప్రజలకు మీరిచ్చే సందేశం ?

జవాబు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత. గృహ, వ్యాపార సముదాయాల నుంచి వచ్చిన చెత్తను ఆరుబయట వేయకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగించాలి.

నాలా పనులను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: మున్సిపాలిటీల్లో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మీర్‌పేటలోని ఎస్వైఆర్ గార్డెన్స్‌లో ఎస్ఎన్‌డీపీ నాలా పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇటీవల భారీ వర్షాలు పడినప్పటికీ నాలాల నిర్మాణంతో గతంలోలా ముంపు సమస్య లేదని తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో సుమారు రూ.13 కోట్లతో నాలాల పనులు జరుగుతున్నాయని, నబీల్‌కాలనీలో పై ప్రాంతాల నుంచి వరదనీరు రావడంతో సమస్య ఏర్పడిందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రేటర్ పరిధిలో రూ.1200 కోట్లతో నాలాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇందులో రూ.110 కోట్లతో మహేశ్వరం నియోజకవర్గంలో పనులు జరుగుతున్నాయని వివరించారు. సమావేశంలో మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్లు వాణి, వసంత, ఎస్ఎన్‌డీపీ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా మహేశ్వరం

మహేశ్వరం: మన ఊరు–మన బడి మొదటి విడతలో ఎంపిక కాని పాఠశాలల ఫర్నీచర్‌కు రూ.7 కోట్ల 75 లక్షల నిధులు మంజూరయ్యాయని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో ఎంపిక కాని పాఠశాలల్లో మరమ్మతులకు ఇదివరకే రూ.9కోట్ల 13లక్షల పై చిలుకు నిధులు మంజూరు చేశామన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సకల హంగులు కల్పిస్తుందన్నారు. త్వరలో మహేశ్వరం నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుందని తెలిపారు. నిధులు విడుదల చేయడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష



నిరసన తెలుపుతున్న దావుత్‌ఖాన్ భూబాధితులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని దావుత్‌ఖాన్‌గూడలో సర్వేనంబర్–2లో భూబాధితుల కుటుంబాలు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 3వ రోజుకు చేరుకున్నాయి. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన దారిలో ఉన్న ఈ భూమి వద్ద బాధితులు, మహిళలు పిల్లలతో కలిసి నిరసనకు దిగారు. మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రస్తుతం ఉన్న ఖాళీ భూమి మొత్తాన్ని 300 కుటుంబాలకు 120 గజాల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుని ఆభూమినే నమ్ముకుని ఉన్న మా కుటుంబాలకు అన్యాయం చేయవద్దని కోరారు. కబ్జాలో ఉన్న మాకు న్యాయం చేయాలని కోరారు. దీక్షలు చేస్తున్న వారిలో లక్ష్మమ్మ, కలమ్మ, అంజమ్మ, అండాలు, రమేష్, యాదయ్య, రాములు, ఉమాకాంత్, మురళి తదితరులున్నారు.

మహేంద్రకుమార్‌రెడ్డికి మల్టిపుల్ అవార్డు

మహేశ్వరం: లయన్స్ జిల్లా 320–ఏ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ డా.జి.మహేంద్రకుమార్‌రెడ్డికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న జిల్లాల్లో అత్యున్నత పురస్కారం తెలంగాణ మల్టిపుల్ అవార్డుకు ఎంపికయ్యారు. సమాజంలో లయనిజం వ్యాప్తికి విశేష కృషి చేసినందుకు గాను అవార్డును అందజేశారు. సోమవారం రాత్రి నగరంలోని కొంపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మల్టిపుల్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు, గాట్ ఇసామే లీడర్ లయన్ సునీల్‌కుమార్, ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ నరేందర్‌రెడ్డి, మల్టిపుల్ లీడర్ చెన్న కిషన్‌రెడ్డి చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మహేంద్ర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అవార్డును అందుకోవడం మూడోసారి అని ఈ సేవలకు గుర్తింపుగా గత మార్చిలో జరిగిన ఎన్నికల్లో తనను ఏకగ్రీవంగా వైస్ గవర్నర్‌గా ఎన్నుకున్నారన్నారు. లయన్స్ క్లబ్‌లను విస్తరించి మరింత ఎక్కువగా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతామన్నారు.

కథనభేరికి తరలిన నాయకులు

ఆమనగల్లు: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ విద్యార్థి కథనభేరి సభకు ఆమనగల్లు పట్టణం నుంచి ఏబీవీపీ నాయకులు తరలివెళ్లారు. ఆమనగల్లు పట్టణంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో కథనభేరి సభకు తరలివెళ్లారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీకి నెల క్రితం మంత్రి సబితారెడ్డి చొరవ తీసుకుని బీటీ మరియు సీసీ రోడ్లకు రూ.2.20 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ బోయపల్లి దీపిక ఆధ్వర్యంలో రోడ్డు పనులు ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. వినాయకహిల్స్ కాలనీలో 40 ఫీట్ల బీటీ రోడ్డు లేక మొన్నటి వర్షాలకు బురదమయంగా మారిందని అన్నారు. గతంలో ఈ విషయాన్ని మంత్రి సబితా రెడ్డి దృష్టికి తీసుకురాగా చొరవ చూపించి నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బి.శేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: చెట్ల కొమ్మలు తొలగింపు పనుల వలన బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని మీర్‌పేట ఏఈ ఎస్.ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జయశ్రీకాలనీ ఫీడర్ పరిధిలోని శివాజీనగర్, సర్వోదయనగర్, ప్రగతికాలనీ, ఎంఎల్ఆర్ కాలనీ, సీతాహోమ్స్, మీర్‌పేట మున్సిపల్ కార్యాలయం, సాయివిహార్‌నగర్, ప్రశాంతిహిల్స్ కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ కేశవరెడ్డినగర్ ఫీడర్ పరిధిలోని కేశవరెడ్డినగర్, టీఎస్ఆర్ నగర్, డైనమిక్‌కాలనీ, మీర్‌పేట విలేజ్, రాఘవేంద్ర కాలనీ, సిర్లాహిల్స్ కాలనీలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

లెనిన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

11కేవీ ధాతూనగర్ ఫీడర్ పరిధిలోని ధాతూనగర్, సుభాష్‌చంద్రబోస్ కాలనీ, తిరుమలనగర్, పోష్‌కాలనీ, శ్రీదత్తానగర్, బీడీఎల్ క్వార్టర్స్, మిధానీ ఎన్‌క్లేవ్, జయభారత్‌నగర్, దత్తానగర్, బీజేపీ క్వార్టర్స్ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సబ్‌స్టేషన్ ఏఈ నాగిరెడ్డి తెలిపారు.

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో..

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జేబీకాలనీ, చాణక్యపురి ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 11కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు. 11కేవీ పోస్టాఫీసు ఫీడర్ పరిధిలోని కాలనీలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు. 11కేవీ హరిపురికాలనీ, సరూర్‌నగర్, స్టేడియం ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియగదారులు సహకరించాలని కోరారు.

హరితహారం అందరి బాధ్యత



తుక్కుగూడ: మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ లావణ్య

తుక్కుగూడ: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కౌన్సిలర్ సప్పిడి లావణ్య సూచించారు. మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని 13వ వార్డులో మొక్కలను పంపిణీ చేశారు. హరితహారంలో భాగంగా ఇంటింటికి పండ్లు, పూల మొక్కలను పంపిణి చేశామన్నారు. మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

దెబ్బడగూడలో హరితహారం

మహేశ్వరం: కందుకూరు మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రశాంత్, సభ్యులు పాల్గొన్నారు.



మహేశ్వరం: మొక్కలు నాటుతున్న సభ్యులు